## క్లుప్తంగా

### బతుకమ్మకు పూజలు



ముష్టికుంట్ల(తిరువూరురూరల్): దసరా ఉత్సవాల్లో భాగంగా మండలంలోని ముష్టికుంట్ల జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు శనివారం బతుకమ్మకు పూజలు నిర్వహించారు. పూలతో బతుకమ్మలను తయారు చేసి ఆటపాటలతో సందడి చేశారు. అనంతరం బతుకమ్మలను పాఠశాల సమీపంలోని పంట కాలువలో నిమజ్జనం చేశారు. దసరా పండుగ విశిష్టతను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి. వీరభద్రరావు విద్యార్థులకు వివరించారు.

### సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత



నూజివీడు: పేదల ఆరోగ్య భద్రతకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. స్థానిక శ్రీనివాస సెంటర్‌లో శనివారం 122 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ.కోటి విలువైన చెక్కులను, 104 మంది కల్లు గీత కార్మికులకు కొత్త కార్డులను మంత్రి పంపిణీ చేసి మాట్లాడారు. అనంతరం ఉర్దూ యూపీ స్కూల్‌లో మొక్కలు నాటి విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. మునిసిపల్ వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

### అభ్యుదయ కవులకు గురజాడ ఆదర్శం




తిరువూరు: సామాజిక సమస్యలు, రుగ్మతలపై గళమెత్తిన అభ్యుదయ కవితా పితామహుడు గురజాడ అప్పారావు నేటి రచయితలకు ఆదర్శప్రాయుడని తిరువూరు జెడ్పీ బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి. సత్యనారాయణరాజు అన్నారు. ఈ నెల 21న గురజాడ జయంతి సందర్భంగా శనివారం పాఠశాలలో ఆయన చిత్రపటానికి ఉపాధ్యాయులు పూలమాల వేసి నివాళులర్పించారు. దేశమంటే మట్టి కాదోయ్, దేశమంటే మనుషులోయ్ అని చాటిచెప్పిన గురజాడ సామాజిక చైతన్యం కలిగించారన్నారు. ఉపాధ్యాయినులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### పర్యావరణ రక్షణ అందరి బాధ్యత



జి.కొండూరు: పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలను నాటడంతో పాటు వాటి సంరక్షణ బాధ్యతను కూడా మనమే తీసుకోవాలని ఎంపీపీ వేములకొండ లక్ష్మీతిరుపతమ్మ అన్నారు. స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ రామకృష్ణ నాయక్‌తో కలిసి ఎంపీపీ శనివారం మొక్కలు నాటారు. కార్యక్రమంలో సర్పంచ్ మండల అరుణ, అధికారులు పాల్గొన్నారు

### క్రీడా పోటీలకు 58 మంది బాలికల ఎంపిక



జి.కొండూరు: స్థానిక శాగం శివరామిరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బాలికల విభాగంలో క్రీడా ఎంపిక పోటీలను శనివారం నిర్వహించారు. మండల స్థాయి అండర్ 14, 17 బాలికల విభాగంలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, చెస్, యోగా పోటీలకు మొత్తం 150 మంది క్రీడాకారిణులు హాజరయ్యారు. వీరిలో ఉత్తమ ప్రతిభ చాటిన 58 మందిని డివిజన్ స్థాయిలో నిర్వహించే క్రీడా పోటీలకు ఎంపిక చేసినట్లు ఎస్‌జీఎఫ్ మండల ఇన్‌చార్జి పురుషోత్తం తెలిపారు. హెచ్‌ఎం శ్రీలత, ఎంఈఓ వీరాస్వామి, పీడీలు శ్రీలత, సునీత, పీఈటీలు మాధవరావు, మార్తా పాల్గొన్నారు.

### 15 లీటర్ల సారా స్వాధీనం

చాట్రాయి: మండలంలోని పెద్ద తండాలో నిర్వహించిన దాడుల్లో హసావతు సాయికుమార్, హసావతు ప్రతాప్‌లను అదుపులోకి తీసుకుని, వారి నుంచి 15 లీటర్ల సారా, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నామని నూజివీడు ఎక్సైజ్ సీఐ మస్తానరావు శనివారం తెలిపారు. పోలవరంలో నల్లబెల్లం అమ్ముతున్న సుగ్గాల రవికుమార్‌పై కేసు నమోదు చేశామని చెప్పారు.

# అప్పుల ఊబిలో అరటి రైతులు

- ఎన్నడూ లేనంతగా ధర పతనం
- రూ.17 వేల నుంచి రూ.4 వేలకు పడిపోయిన టన్ను ధర
- గిట్టుబాటు ధర లేక దిగాలు



ముసునూరులో రైతులు సాగుచేసిన అరటి తోట

నూజివీడు: కూటమి ప్రభుత్వంలో పంటలకు మద్దతు ధర కరువై, పెట్టుబడులు రాక రైతులు అప్పులపాలవుతున్నారు. ప్రస్తుతం ఈ పరిస్థితి అరటి రైతుల వంతయింది. నూజివీడు నియోజకవర్గం మూసునూరు మండలంలో సుమారు రెండు వేల ఎకరాల్లో అరటి సాగవుతుండగా గిట్టుబాటు ధర లేక రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు.

**ధర పతనం..**

ముసునూరు, చెక్కపల్లి, గోగులంపాడు, కాట్రేనిపాడు, గోపవరం గ్రామాలు అరటి సాగుకు పెట్టింది పేరు. నాలుగైదు దశాబ్దాలుగా రైతులు ఇక్కడ అరటి పంటను సాగు చేస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది అరటి పంట ధర పతనమైంది. గత ఏడాది పచ్చ అరటి టన్ను ధర రూ.18 వేలు పలకడంతో ఈ ఏడాది కూడా మంచి ధర వస్తుందనే ఆశతో రైతులు అధిక కౌలు చెల్లించి మరీ పచ్చ అరటి పంటను సాగు చేశారు. నేడు కనీస ధరకు కూడా అరటి కాయలను కొనే నాథుడు లేకపోవడంతో రైతులు అప్పుల పాలవుతున్నారు. సీజన్ ప్రారంభంలో టన్ను అరటి ధర రూ.17 వేలు ఉండగా అది క్రమేణా రూ.15 వేలకు, రూ.10 వేలకు పడిపోయి ప్రస్తుతం రూ.4 వేలు మాత్రమే పలుకుతోంది. దీంతో రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయారు.

**కొనేనాథుడు లేడు..**

దళారులు గతంలో తోట దగ్గరకే వచ్చి మరీ రేటు నిర్ణయించి అడ్వాన్సు ఇచ్చి కొనేవారు. నేడు పరిస్థితి అందుకు పూర్తి విరుద్ధంగా ఉంది. ఫస్ట్ క్వాలిటీ ధర రూ.5,900 నిర్ణయించి, రైతుకు నగదు చెల్లించే సమయంలో ముందు మాట్లాడిన రేటు లేదంటూ తగ్గించి ఇవ్వడంతో పాటు, మళ్లీ తోటలో ఉన్న గెలలు కొనడానికి రావడం లేదు. రైతులు ఫోన్ చేస్తే రేపు వస్తాం.. మాపు వస్తాం అంటూ కాలం వెళ్లబుచ్చుతున్నారే తప్ప అరటికాయలు కోసిన పాపాన పోలేదని రైతులు వాపోతున్నారు. అరటి ఎగుమతులు లేకపోవడంతో రేటు తగ్గిందని చెబుతున్నారు.



అరటి కాయలను లోడ్ చేస్తున్న కూలీలు

**దిక్కుతోచని స్థితి**

పంట చేతికొచ్చే సమయంలో అరటి ధర తగ్గడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పరిస్థితి ఇలాగే ఉంటే తమకు ఆత్మహత్యలే శరణ్యమని వాపోతున్నారు. వరి, పత్తి, మొక్కజొన్న, పొగాకు వంటివి మూడు నుంచి నాలుగు నెలల్లో చేతికి వస్తుందని, అరటి పంట ఏడాది పొడవునా పెట్టుబడులు పెట్టాల్సి వస్తోందని రైతులు చెబుతున్నారు.

**కోల్డ్ స్టోరేజీలు నిర్మించాలి**

అరటి టన్ను కనీస ధర రూ.15 వేలు ఉంటే రైతులు పెట్టిన పెట్టుబడి, కౌలు ఖర్చు పోను మిగులు ఉంటుంది. ఒకవైపు రోజురోజుకు పెట్టుబడులు పెరుగుతుండగా మద్దతు ధర పడిపోతుండటంతో రైతు కళ్లల్లో కన్నీరే మిగులుతోంది. హైదరాబాద్ ప్రాంతం నుంచి అరటి మొక్కలను తెప్పించి నాటే సరికి ఒక్కో మొక్కకు రూ.15లు ఖర్చవుతుంది. మొక్క నాటిన నాటి నుంచి నిరంతరం ఒడిదొడుకులను ఎదుర్కొంటూ రైతులు ముందుకు సాగుతున్నారు. అరటికి మద్దతు ధర కల్పించి ఆదుకోవాలని, అరటి పంట నిల్వ చేసుకునేందుకు కోల్డ్ స్టోరేజీలు నిర్మించాలని రైతులు కూటమి ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

**పండిపోయిన అరటి కాయలు**



అరటి టన్ను ధర కనీసం రూ.4 వేలు కూడా రావడం లేదు. కోసేవారు లేక తోటలోనే అరటి కాయలు పండిపోతున్నాయి. 20 ఎకరాలు కౌలుకు తీసుకొని అరటి పంటను సాగు చేశా. కొనేవారు లేకపోవడంతో తోటంతా దున్నేశా. దాదాపు రూ.40 లక్షలు నష్టం వాటిల్లింది. ప్రభుత్వం ఆదుకోవాలి.

– మారుమూడి చిన్నికృష్ణ, సింహాద్రిపురం, ముసునూరు మండలం

**సిండికేట్ అవుతున్న దళారులు**



12 ఎకరాలు కౌలుకు తీసుకుని అరటి సాగు చేస్తే పెట్టుబడులు రాలేదు. దళారులు సిండికేట్ అయ్యి ధరను పతనం చేశారు. రూ.18 లక్షల వరకు పెట్టుబడి పెట్టగా, సగం పెట్టుబడి కూడా రాలేదు. టన్నుకు రూ.3 వేలు, రూ.4 వేలు మాత్రమే ధర లభిస్తుండటంతో ఏమి చేయాలో తెలియడం లేదు.

– గోగం రాంబాబు, ముసునూరు

## వసంతకు వ్యక్తిగత ప్రయోజనాలే ముఖ్యం

- మాజీ మంత్రి జోగి రమేష్
- తన సోలార్ కంపెనీ సబ్సిడీలపై ఉన్న ప్రేమ ప్రజలపై లేదని ధ్వజం



జోగి రమేష్

ఇబ్రహీంపట్నం: ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్‌కు ప్రజల ప్రయోజనాల కంటే తన వ్యక్తిగత ప్రయోజనాలే ముఖ్యమని అసెంబ్లీ వేదికగా ఆయన మాటలు తేటతెల్లం చేస్తున్నాయని మాజీ మంత్రి జోగి రమేష్ అన్నారు. మైలవరం నియోజకవర్గ సమస్యలు, ఎన్టీటీపీఎస్ కాలుష్యం, బూడిద సమస్యలను అసెంబ్లీలో ఎందుకు ప్రస్తావించలేదని జోగి రమేష్ ప్రశ్నించారు. ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో స్థానిక సమస్యలు ప్రస్తావిస్తారని ఎదురు చూసిన ప్రజలకు ఎమ్మెల్యే నిరాశే మిగిల్చాడన్నారు. ఇబ్రహీంపట్నంలో శనివారం నిర్వహించిన సమావేశంలో జోగి రమేష్ మాట్లాడుతూ ప్రజలు, లారీ డ్రైవర్ల సమస్యలు గాలికి వదిలేసి, నీ సోలార్ కంపెనీ సబ్సిడీల కోసం అసెంబ్లీలో మాట్లాడతావా అని నిలదీశారు.

**బూడిద కాలుష్యంపై ఎందుకు ప్రశ్నించలేదు**

నియోజకవర్గంలో వందల మంది లారీ ఓనర్లను నిరాశ్రయులను చేసిన బూడిద టెండర్, కాలుష్యంపై అసెంబ్లీలో ఎందుకు ప్రశ్నించలేక పోయావన్నారు. అసెంబ్లీలో ఎన్టీటీపీఎస్ ఏపీ జెన్‌కో అధికారులు, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, మంత్రి నారా లోకేష్, సీఎం చంద్రబాబు నాయుడు అందరూ ఒకే చోట అసెంబ్లీలో ఉండగా ఎన్టీటీపీఎస్ బూడిద టెండర్ అంశం వారి దృష్టికి తీసుకువెళ్లలేక పోవడానికి కారణమేమిటన్నారు. బూడిద అక్రమ రవాణా, లోపభూయిష్టమైన టెండర్ విధానం, బూడిద కాలుష్యంలో వారి ప్రమేయం కూడా ఏమైనా ఉందా అని ప్రశ్నించారు. టెండర్ విధానంలో సూట్ కేసులు చేతులు మారాయనే అనుమానం ఈప్రాంత ప్రజల్లో నెలకొందని చెప్పారు.

**సమస్యలపై ప్రస్తావన ఏదీ?**

ఒక పక్క రోడ్లు అస్తవ్యస్తంగా మారాయని, మరో వైపు బుడమేరు గండ్లు పూడ్చలేక పోయారన్నారు. నియోజకవర్గంలోని సమస్యలు ఎందుకు ప్రస్తావించలేదన్న ప్రజల అనుమానాన్ని నివృత్తి చేయాల్సిన బాధ్యత ఎమ్మెల్యే వసంతపై ఉందన్నారు. సీఎంను కలిసి బూడిద సమస్యపై ఎందుకు మాట్లాడలేక పోతున్నాడని, దీని వెనుక లోగుట్టు ఏమై ఉంటుందని అనుమానం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా మన ప్రాంతం ప్రజలు, ప్రజాప్రతినిధులు, నాయకులు ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ మన ప్రాంతానికి చేస్తున్న ద్రోహం, మోసం గమనించాలని కోరారు. అధికారులు అక్రమ బూడిద నిల్వలపై తక్షణం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## లింగ నిర్ధారణ పరీక్షల నిరోధంపై ర్యాలీ

ఆగిరిపల్లి: గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరమని స్థానిక పీహెచ్‌సీ వైద్యులు జాస్తి జగన్మోహన్‌రావు అన్నారు. శనివారం ఆగిరిపల్లిలో గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షల నిరోధంపై విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. డాక్టర్లను సంప్రదించకుండా మందుల షాపుల వద్ద గర్భనిరోధక మాత్రలను అమ్మితే చర్యలు తీసుకుంటామని డాక్టర్ జగన్మోహన్‌రావు హెచ్చరించారు. పుట్టబోయే బిడ్డ ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకునేందుకు స్కానింగ్ చేయించుకోవాలని, లింగ నిర్ధారణ చేసిన, తెలుసుకోవాలని చూసినా నేరమే అవుతాయని చెప్పారు. బాలబాలికలు ఇద్దరు సమానమే అనే విషయం తల్లిదండ్రులు గుర్తుంచుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఆగిరిపల్లిలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

## సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద వీఆర్ఏల ధర్నా

నూజివీడు: పేస్కేల్ అమలు చేయాలని కోరుతూ ఏపీ గ్రామ వీఆర్ఏల సంఘం ఆధ్వర్యంలో శనివారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద వీఆర్ఏలు ధర్నా నిర్వహించారు. పలువురు మాట్లాడుతూ నిత్యావసర సరుకుల ధరలు పెరగడంతో తమ జీవనం అస్తవ్యస్తంగా మారిందన్నారు. వీఆర్ఏలను రాత్రి కాపలాదారులుగా, కంప్యూటర్ ఆపరేటర్లుగా పనిచేయిస్తున్నారని చెప్పారు. నామినీలుగా పనిచేస్తున్న వీఆర్ఏలను రెగ్యులర్ చేయాలని, నెలకు రూ.25 వేల వేతనం ఇవ్వాలని కోరుతూ సబ్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్నకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వీఆర్ఏలు బి.ప్రశాంత్, జి.రామకృష్ణ, కె.రాధమ్మ, ఎస్.ఆదిలక్ష్మి, పాత రెవెన్యూ డివిజన్ పరిధిలోని 14 మండలాల వీఆర్ఏలు పాల్గొన్నారు.



సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న వీఆర్ఏలు

### ప్రకృతి సాగుకు ప్రోత్సాహం

కాకర్ల(తిరువూరురూరల్): ప్రకృతి వ్యవసాయం చేసే రైతులకు ప్రభుత్వం తగు ప్రోత్సాహాలనందిస్తోందని రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ విజయ్‌కుమార్ అన్నారు. కాకర్ల శివారు రామన్నపాలెంలో ప్రకృతి సేద్యం చేస్తున్న రైతుల పొలాలను రాష్ట్ర వ్యవసాయ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రాజశేఖర్, జలవనరుల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సాయిప్రసాద్‌లతో కలిసి విజయకుమార్ శనివారం పరిశీలించారు. అనంతరం గ్రామ సచివాలయం వద్ద రైతులకు అవగాహన సమావేశం నిర్వహించారు. డ్రమ్ సీడర్ పద్ధతిలో వరి సాగు చేయడం వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు. జిల్లా ప్రాజెక్టు మేనేజరు శంకర్ నాయక్, డీఏఓ విజయకుమారి, తిరువూరు మండల వ్యవసాయాధికారి పద్మ తదితరులు పాల్గొన్నారు.

## పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం

నూజివీడు: పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యకర సమాజం సాధ్యమవుతుందని జెడ్పీ సీఈఓ ఎం. శ్రీహరి అన్నారు. నూజివీడు మండలం కొత్తూరు తండాలో శనివారం నిర్వహించిన స్వచ్ఛాంధ్ర – స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఆది కర్మయోగి కార్యక్రమంలో భాగంగా గిరిజన గ్రామాల అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఎంపీడీఓ చెన్నా రాఘవేంద్రనాథ్, సీడీపీఓ పిల్లి విజయకుమారి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ బాలాజీ రెడ్డి, హౌసింగ్ ఏఈ నవీన్, పీఆర్ ఏఈ విజయగోపాల్, మాజీ జెడ్పీటీసీ బాణావతు రాజు పాల్గొన్నారు.

**స్వచ్ఛత పాటించాలి**

ముసునూరు : స్వచ్ఛాంధ్ర – స్వచ్ఛ దివస్ ద్వారా అన్ని గ్రామ పరిసరాల్లో చెత్తా చెదారం తొలగించి, దోమలు, క్రిమి కీటకాలను నిర్మూలించాలని ఎంపీడీఓ సత్యనారాయణ సూచించారు. గ్రామ సచివాలయాల వద్ద సర్పంచ్‌ల అధ్యక్షతన కార్యాలయ పరిసరాలను పరిశుభ్రం చేయించారు. అక్కిరెడ్డిగూడెం, చింతలవల్లి పరిసరాలను శుభ్రం చేయించి, దోమల నివారణ మందు స్ప్రే చేయించారు. వేల్పుచర్ల సచివాలయం వద్ద తహసీల్దార్ డి.ప్రశాంతి, సర్పంచ్ మోహనరావు, ఎంపీటీసీ సుబ్బారావు పారిశుద్ధ్య కార్యక్రమాలను పర్యవేక్షించి, మొక్కలు నాటారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సత్య ప్రసాద్, పీఆర్ ఏఈ ప్రసాద్ కార్యక్రమాలను పర్యవేక్షించారు. ప్రజలంతా స్వచ్ఛతకు కట్టుబడి ఉండాలని ప్రతిజ్ఞ చేయించారు. ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, అధికారులు, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.



కొత్తూరు తండాలో మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ శ్రీహరి



వేల్పుచర్లలో మొక్క నాటుతున్న తహసీల్దార్ ప్రశాంతి, ప్రజాప్రతినిధులు

● మైలవరం: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్క రూ మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యత తీసుకోవాలని రెడ్డిగూడెం సర్పంచ్ మల్లాది రాణి అన్నా రు. స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా రెడ్డిగూడెంలో శనివారం మొక్కలు నాటి ఆమె మాట్లాడారు. మొక్కల పెంపకంతో పర్యావరణాన్ని రక్షించవచ్చన్నారు. ఎంపీడీఓ, గ్రామస్తులు పాల్గొన్నారు.

### విశ్వకర్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లిలోని విశ్వకర్మ దేవాలయంలో స్వామివారిని విశ్వబ్రాహ్మణ ఫైనాన్స్, డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ కమ్మరి పార్వతమ్మ శనివారం దర్శించుకుని పూజలు చేశారు. వేదపండితులు ఆమెకు ఆశీర్వచనాలు అందజేశారు. ఆలయ ట్రస్టీ చైర్మన్ కత్తురోజు రామకృష్ణ, విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

### నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మైలవరం: గణపవరం విద్యుత్ ఉప కేంద్రం పరిధిలోని గ్రామాల్లో ఆదివారం ఉదయం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ ఏఈ సీహెచ్ రామమోహనరావు తెలిపారు. గణపవరం, కీర్తిరాయునిగూడెం గ్రామాల్లో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని చెప్పారు.

### అడుగు బయట పెట్టేదెలా?



రెడ్డిగూడెం(జి.కొండూరు): రెడ్డిగూడెంలోని కాపుల బజారులో సీసీ రోడ్లు ఉన్నప్పటికీ పక్కా డ్రెయినేజీ వ్యవస్థ లేదు. కాలువల్లో పూడిక తీయకపోవడంతో మురుగునీరు రోడ్లపైకి చేరి స్థానికులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఇక్కడ ఒక ప్రధాన రహదారితో పాటు ఐదు అంతర్గత రహదారులు ఉన్నాయి. ప్రధాన రహదారి మినహా ఏ రహదారికి డ్రెయినేజీ వ్యవస్థ లేదు. స్థానికులు ఇళ్లల్లో వాడుతున్న నీరు రహదారుల పైకి చేరి నడవడానికి కూడా వీలులేక ఇబ్బంది పడుతున్నారు. మురుగునీరు రహదారిపై రోజుల తరబడి నిల్వ ఉండటంతో ఈగలు, దోమల ఉధృతి ఎక్కువై వ్యాధుల భారిన పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి మురుగునీరు పోయే మార్గం చూపాలని కోరుతున్నారు.

## గర్భిణులకు పౌష్టికాహారం తప్పనిసరి

పెద్దవరం(తిరువూరురూరల్): గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా పోషక విలువలున్న ఆహారం తీసుకోవాలని పెద్దవరం సర్పంచి గద్దె అప్పారావు అన్నారు. పెద్దవరం అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం స్వస్థ్ నారీ స్వశక్తి పరివార్ యోజన కార్యక్రమంలో భాగంగా గర్భిణులు, బాలింతలకు రాజుగూడెం పీహెచ్‌సీ వైద్య సిబ్బంది ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో లభ్యమయ్యే పౌష్టికాహారంపై వారికి అవగాహన సమావేశం నిర్వహించారు. అప్పారావు మాట్లాడుతూ మంచి పౌష్టికాహారం తీసుకున్న గర్భిణులకు ఆరోగ్యకరమైన బిడ్డ పుడతాడని, బాలింతలు కూడా ఆరోగ్యం, ఆహారంపై శ్రద్ధ వహించాలని సూచించారు. అంగన్‌వాడీ, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

**వైద్య శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలి**

చాట్రాయి: మహిళ ఆరోగ్య పరిరక్షణకు ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని చాట్రాయి పీహెచ్‌సీ వైద్యాధికారి జ్యోతి అన్నారు. శనివారం చాట్రాయి మండలం నర్సింహారావుపాలెం సచివాలయంలో నిర్వహించిన స్వస్థ్ నారీ స్వశక్తి పరివార్ అభియాన్‌లో భాగంగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో మహిళలకు వివిధ వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు దుర్గాప్రసాదు, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

**మహిళలకు వైద్య పరీక్షలు**

నూజివీడు: స్థానిక కోనేరుపేటలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద స్వస్థ్ నారీ స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శనివారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని మున్సిపల్ వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణ ప్రారంభించారు. వైద్యులు నరేంద్రకృష్ణ, సాయిసుధలు మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులను అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మౌనిక, టీడీపీ నాయకుడు మున్నీ, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఎన్టీటీపీఎస్‌లో ‘స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్’

ఇబ్రహీంపట్నం: ఎన్టీటీపీఎస్‌లో స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమం శనివారం నిర్వహించారు. పచ్చదనం, పరిశుభ్రతలో భాగంగా ఏ,బీ, సీ కాలనీలో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. వివిధ ప్రాంతాల్లో మొక్కలు నాటారు. చీఫ్ ఇంజినీర్ శివరామాంజనేయులు మాట్లాడుతూ తడి, పొడి చెత్త వేరుచేసి తయారు చేసిన వర్మి కంపోస్ట్ ఎరువును మొక్కల పెంపుదలకు వినియోగించాలని సూచించారు. పచ్చదనం పెంపొందిస్తామని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతామని ప్రతిజ్ఞ చేశారు. సంస్థకు చెందిన పలువురు సీనియర్, జూనియర్ ఇంజినీర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చీఫ్ ఇంజినీర్ శివరామాంజనేయులు

### తిరువూరు బస్టాండ్‌లో చోరీ

**ప్రయాణికురాలి పర్సు నుంచి రూ. లక్ష మాయం**

తిరువూరు: నిత్యం రద్దీగా ఉండే తిరువూరు ఆర్టీసీ బస్టాండ్‌లో శనివారం సాయంత్రం ఓ మహిళ చేతి సంచిలో లక్ష రూపాయల నగదును దొంగలు తస్కరించారు. తెలంగాణ రాష్ట్రంలోని భద్రాచలం నుంచి విజయవాడ వెళ్లే ప్రయాణికురాలు యడవల్లి మరియమ్మ చేతి సంచిలోని పర్సులో నగదు ఉంచి తిరువూరు బస్టాండ్‌లో టాయిలెట్‌కు వెళ్లి తిరిగి బస్సు ఎక్కుతుండగా ఆమె చేతిలోని సంచిలో పర్సును గుర్తుతెలియని వ్యక్తులు అపహరించి పరారయ్యారు. బస్సులో కూర్చున్న అనంతరం మరియమ్మ డబ్బుల కోసం పర్సు చూడగా కనిపించలేదు. బాధితురాలు కంట్రోలర్‌కు ఫిర్యాదు చేయడంతో పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అత్యవసర పనికై డబ్బులు తీసుకు వెళుతుండగా చోరీ జరగడంతో ఆమె కన్నీరుమున్నీరు అవుతోంది. దీనిపై దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.

**వరుస చోరీలతో బెంబేలు**

ఇటీవల తిరువూరు బైపాస్ రోడ్డులో ఆగి ఉన్న కారులో రూ.లక్ష నగదు అపహరణకు గురైన ఘటన మరువకముందే మర్నాడు కాకర్లలో ఆటో ఎక్కిన మహిళ మెడలో బంగారు నగలు చోరీ చేసి ఆటోవాలా పరారయ్యాడు. వరుస చోరీలతో తిరువూరు ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు.

### చినుకుపడితే చెరువే!



ఆగిరిపల్లి: వర్షం పడితే అడవినెక్కలం జిల్లా పరిషత్ హైస్కూల్ ఆవరణ చెరువులా మారుతోంది. పాఠశాల ఆవరణ పల్లంగా ఉండటంతో చుట్టుపక్కల నీరు మొత్తం పాఠశాలలోకి చేరుతోంది. విద్యార్థులు బురద నీటిలో నడుచుకుంటూ తరగతి గదులకు వెళుతున్నారు. కొందరు విద్యార్థులను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు చేయి పట్టుకుని బురద నీటిలోనే తీసుకొస్తున్నారు. వర్షం పడితే చాలు పిల్లలకు తిప్పలు తప్పడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. పాఠశాల ఆవరణలో నీరు నిలవకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.